RNI NO : TGTEL/25/A3536

# ఏక్ దం న్యూస్

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 21 జనవరి 2026 సంపుటి : 01 సంచిక 05 పేజీలు 05 కరీంనగర్

## కరీంనగర్ లో కలకలం

**డంప్ యార్డ్ లో మానవ కాలు**





- ప్రభుత్వ స్టేడియంపై దర్జావినియోగం
- ప్రయివేట్ స్కూల్ల నియమవధ
- అధికార అలక్ష్యానికి అదాయఘాతం
- డివైఎస్ఓ మౌనంపై సందేహస్ఫురణ
- ఉన్నాతాధికారుల చర్యలు గగరమా?

# అంబేద్కర్ స్టేడియం ఎవరి సొత్తు?

**పభుత్వ అధీనంలోని అంబేద్కర్ స్టేడియం ప్రయివేట్ విద్యాసంస్థల అక్రమ వినియోగానికి అడ్డాగా మారిందా? అన్న అనుమానాలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. స్టేడియం సమీపంలో ఉన్న లెజెండ్ హై స్కూల్(ప్రయివేట్) యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండా, డీడీ లేదా ఫీజు చెల్లించకుండానే స్టేడియం ఆవరణలో తమ విద్యార్థులతో రెగ్యులర్‌గా క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**
ప్రభుత్వ అధీనంలోని అంబేద్కర్ స్టేడియం ప్రయివేట్ విద్యాసంస్థల అక్రమ వినియోగానికి అడ్డాగా మారిందా? అన్న అనుమానాలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. స్టేడియం సమీపంలో ఉన్న లెజెండ్ హై స్కూల్(ప్రయివేట్) యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండా, డీడీ లేదా ఫీజు చెల్లించకుండానే స్టేడియం ఆవరణలో తమ విద్యార్థులతో రెగ్యులర్‌గా క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**వినియోగానికి, డీడీ/ఫీజు అనుమతులేవి?**

స్కూల్ యాజమాన్యం వివరణ ప్రకారం 26 జనవరి వేడుకల కోసం స్టేడియాన్ని వినియోగిస్తున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉందని విద్యార్థులే వెల్లడించారు. తమ స్కూల్ స్పోర్ట్స్ టైంలో స్టేడియంలోనే ఆటలు ఆడుతున్నామని విద్యార్థులు చెప్పడం గమనార్హం. ఇది ఒకరోజు కార్యక్రమం కాదు, నిరంతర వినియోగం అన్న విషయం బహిర్గతమవుతోంది. స్కూల్ వ్యాన్లు సైతం స్టేడియం ఆవరణలోనే పార్కింగ్ చేస్తున్నారు. ప్రభుత్వ స్టేడియాన్ని ప్రయివేట్ స్కూల్ వినియోగించుకోవాలంటే తప్పనిసరిగా స్టేడియం అధికారుల అనుమతి డిమాండ్ డ్రాఫ్ట్ లేదా వినియోగ ఫీజు, వినియోగానికి సంబంధించిన అధికారిక లేఖలు అవసరమవుతాయి. అయితే లెజెండ్ హై స్కూల్ విషయంలో ఇవేవీ లేకుండానే స్టేడియం వినియోగం జరుగుతోందన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. దీని ద్వారా ప్రభుత్వ ఆదాయానికి నేరుగా గండి పడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**డివైఎస్ఓ మౌనసాక్ష్యం, అనుమానాలకు తావు.**

ఈ మొత్తం వ్యవహారంపై సంబంధిత అధికారి అయిన డివైఎస్ఓ స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న వినియోగాన్ని గమనించి చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యమా? లేక మరేదైనా కారణమా? అన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

**ఇదొక్క లెజెండ్ సమస్యేనా?.**

కేవలం లెజెండ్ హై స్కూల్ మాత్రమే కాకుండా, కరీంనగర్‌లోని అనేక ప్రయివేట్ అకాడమీలు, కాలేజీలు, స్కూల్లు ఇదే తరహాలో వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు అవసరమైన ఆట స్థలాలు లేకుండానే విద్యా అనుమతులు పొంది, తీరా ఆట స్థలం అవసరమయ్యే సరికి అధికార వ్యవస్థను మచ్చిక చేసుకోవడం, అవసరం వచ్చినప్పుడు ప్రభుత్వ స్టేడియంను అక్రమంగా వినియోగించడం అన్నది వ్యవస్థబద్ధమైన దుర్వినియోగంగా మారిందన్న ఆరోపణలు గంభీరంగా వినిపిస్తున్నాయి.

**ముడుపుల కోణం, రేపుతున్న ఉత్కంఠ.**

డీడీ, ఫీజు చెల్లించకుండా ప్రయివేట్ విద్యాసంస్థలు ఇష్టారీతిన ప్రభుత్వ ఆస్తులను వినియోగిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో ఉత్కంఠను రేపుతోంది. నెలనెలా సంబంధిత అధికారులకు ఏమైనా ముడుపులు ముడుతున్నాయా? అన్న అనుమానం కూడా తీవ్రమవుతోంది. ఇది కేవలం నిబంధనల ఉల్లంఘనే గాక ప్రజాధనానికి ద్రోహంగా మారుతోందన్న ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ స్టేడియం ప్రజల ఆస్తి, ప్రయివేట్ యాజమాన్యాల ఆటస్థలం కాదు. కాబట్టి ఈ వ్యవహారంపై లెజెండ్ హై స్కూల్ యాజమాన్యంపై స్పష్టమైన చర్యలు, ఇప్పటివరకు జరిగిన వినియోగానికి ఫీజు వసూలు, నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు. అవసరమైతే సస్పెన్షన్ వరకు వెళ్లాలన్న డిమాండ్ విద్యార్థి సంఘాల నుండి బలంగా వినిపిస్తోంది. జిల్లా ఉన్నంతాధికారులు చర్యలు తీసుకుంటారా? అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరిస్తారా? లేక పట్టింపులేకుండా కళ్లుమూస్తారా? అన్నది చూడాల్సి ఉంది.



2 ఏక్ దం న్యూస్ సమగ్ర తెలుగు దినపత్రిక కరీంనగర్ బుధవారం 21 జనవరి 2026



# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థులు ఎంపిక

**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**
నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లిలో నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న 69వ రాష్ట్రస్థాయి అండర్–17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన యు. హర్షవర్ధన్, బి. మన్విత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, ప్రిన్సిపల్ సరితా రెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో టీఆర్పీలో భారీ చేరికలు



**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**




టీఆర్పీ పార్టీ కార్యాలయంలో మైనారిటీ, టౌన్, మహిళా విభాగాల నేతల ఆధ్వర్యంలో భారీగా పార్టీలో చేరికలు జరిగాయి. నూతన సభ్యులకు రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రాజకీయాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్పీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# కరీంనగర్ లో కలకలం

## డంప్ యార్డ్ లో మానవ కాలు

**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**
కరీంనగర్ నగరంలోని డంప్ యార్డ్ లో మానవ కాలు కనబడిన ఘటన స్థానికుల్లో కలకలం రేపింది. హాస్పిటల్స్ నుంచి శస్త్రచికిత్సల తర్వాత తొలగించిన శరీర అవయవాలు, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ నియమాలను ఉల్లంఘిస్తూ, నేరుగా డంప్ యార్డ్ లో వేసినట్టు అనుమానాలు వ్యక్తమయ్యాయి. స్థానికులు, చెత్త బండీలు, ట్రాక్టర్ ద్వారా డంప్ యార్డ్‌లో వేసిన ఈ అవయవాల కారణంగా తీవ్ర దుర్వాసన, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు డంప్ యార్డ్ వద్ద పరిశీలన చేపట్టి సమగ్ర దర్యాప్తు ప్రారంభించినట్టు సమాచారం. అయితే, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నియమాల ప్రకారం, మానవ అవయవాలు, శరీర భాగాలు, శస్త్రచికిత్సల తర్వాత మిగిలిన టిష్యూలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే బయో వేస్టేజ్ వారికి ఇస్తే వారు మిషన్స్ తో కాల్చేసి తొలగిస్తారు. కానీ సామాన్య చెత్త డబ్బాలలో



ట్రాక్టర్ ద్వారా డంప్ యార్డ్‌లో వేసుకోవడం నిషేధం. వీటిని కేవలం ఇన్‌సినరేషన్(కాల్చడం) లేదా భూగర్భ ఖననం ద్వారా మాత్రమే సురక్షితంగా తొలగించాలి. కానీ కరీంనగర్‌లో దానికి విరుద్ధ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి అయితే పూర్తి సమాచారం ఇంకా అధికారులు తేల్చాల్సింది ఉంది.

## ఏసీ-రిఫ్రిజిరేషన్-వాషింగ్ మెషిన్ టెక్నీషియన్ల

# డైరీ ఆవిష్కరణ




**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**
కరీంనగర్ జిల్లా ఏసీ, రిఫ్రిజిరేషన్, వాషింగ్ మెషిన్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన డైరీని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు “అల్ఫోర్స్” డా. వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో టెక్నీషియన్ల పాత్ర అత్యంత విశిష్టమైనదని, వారి సేవలు ప్రతి ఇంటికీ అవసరమని అన్నారు. గృహోపకరణాల వినియోగం టెక్నీషియన్ల సేవల ద్వారానే సాధ్యమవుతుందని, అలాంటి సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ జిల్లాలో టెక్నీషియన్ల సంఖ్య ఏటా పెరుగుతుండటం ప్రజల అవసరాలకు అనుగుణంగా వారి సేవలు విస్తరిస్తున్నాయని తెలిపారు. టెక్నీషియన్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వనరులు, వసతులు ప్రభుత్వ స్థాయిలో అందేలా కృషి చేస్తానని, వారి సంఘ బలోపేతానికి అవసరమైన సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాజానికి ఉత్తమ విద్య అందిస్తూ, జాతీయ స్థాయిలో ఫలితాలు సాధిస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్న డా. నరేందర్ రెడ్డిని టెక్నీషియన్స్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఆర్. సంతోష్, జనార్ధన్, కార్యదర్శి ఎం.డి. ఖలీల్, కార్యవర్గ సభ్యులు రఫీ, శ్రీమంత్ రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




తైక్వాండోతో బాలికలకు ఆత్మరక్షణ

■ సుద్దాలలో ఘనంగా బెల్ట్, సర్టిఫికెట్ల ప్రధానోత్సవం

■ బాలికల ఆత్మరక్షణకు తైక్వాండో శుభ పరిణామం

■ సీఎం కప్ ద్వారా గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

# అబ్బురపరిచిన విన్యాసాలు

**ఏక్ దం న్యూస్, కోనరావుపేట:**

కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని శ్రీ రుషి వాణి విద్యానికేతన్ పాఠశాలలో సన్ రైజ్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బాలికలకు ఆత్మరక్షణ కోసం తల్లిదండ్రులు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్పించడం శుభ పరిణామమన్నారు. గతంలో కంటే నేడు మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో రాణించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందించే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం ఆనందకరమన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 40 రకాల ఆటలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. బాలికలు చేసిన తైక్వాండో విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయని ప్రశంసించారు. భవిష్యత్తులో తైక్వాండోలో ఉన్నత స్థాయికి ఎదిగి ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. బాలికల్లో ఆత్మస్థైర్యం పెంచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు.

**అబ్బురపరిచిన బాలికల విన్యాసాలు**

తైక్వాండో బెల్ట్ ప్రదానోత్సవం సందర్భంగా బాలికలు చేసిన విన్యాసాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తలపై, గొంతుపై, నుదుటిపై లైట్ ట్యూబ్‌లను పగలగొట్టడం, పుట్టపై బండరాయిని సుత్తితో పగలగొట్టడం, నిప్పుతో ఉన్న టైల్స్‌ను చేతులతో విరిచడం, రెండు కర్రలు తిప్పడం, నంచాకు విన్యాసాలు ప్రదర్శించడం వంటి సాహసకార్యక్రమాలు హర్షధ్వానాల మధ్య సాగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటెల్లి నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, తైక్వాండో రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి గందె సంతోష్, పాఠశాల కరస్పాండెంట్ స్వామిదాస్, సన్ రైజ్ తైక్వాండో కోచ్ మంగళగిరి శ్రీనివాస్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నీరటి సంజీవ్, వార్డు సభ్యులు, తైక్వాండో కోచ్‌లు విజయసింహాచారి, సంతోష్, కుంగుఫ్ అసిస్టెంట్ గ్రాండ్ మాస్టర్ నేరెళ్ల శ్రీధర్ గౌడ్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం డబ్ల్యుజేఐ నిరంతర పోరాటం

**ఏక్ దం న్యూస్, కరీంనగర్:**

రాష్ట్రంలోని గ్రామీణ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుజేఐ) నిరంతర పోరాటం చేస్తోందని డబ్ల్యుజేఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం, రామగుండం మండలాల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మంగళవారం కరీంనగర్లో డబ్ల్యుజేఐ నాయకులను కలిసి తమ ప్రెస్ క్లబ్‌లను డబ్ల్యుజేఐ అనుబంధంగా కొనసాగించేందుకు అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి డబ్ల్యుజేఐ నేతలు సానుకూలంగా స్పందించి అనుమతి మంజూరు చేశారు. ఈ సందర్భంగా తాడూరు కరుణాకర్ మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యపరిచే కీలక బాధ్యత జర్నలిస్టులు, విద్యావేత్తలపై ఉందన్నారు. డబ్ల్యుజేఐ దీర్ఘకాలిక పోరాట ఫలితంగానే ప్రింట్ మీడియాతో పాటు టెలివిజన్, రేడియో, డిజిటల్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, కార్మిక భద్రతా పరిధిలోకి వచ్చారని తెలిపారు. ఈ నిర్ణయంతో డిజిటల్, టీవీ, రేడియో జర్నలిస్టులు కూడా ప్రింట్ జర్నలిస్టులతో సమానంగా అనేక సంక్షేమ ప్రయోజనాలు పొందనున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత లోపించడమే సమస్యల పరిష్కారానికి ప్రధాన అడ్డంకిగా మారుతోందని వ్యాఖ్యానించారు.



ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంజాల రాధాస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి సందూరి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి కాంపెల్లి మల్లికార్జున స్వామి, కోశాధికారి నగునూరి రాజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

EK DHAM NEWS KNR 21_SHEKHAR 21-01-2026 7:51 AM Page 4





# ముదిరాజులకు 7 సీట్లు ఇవ్వాలి

- అన్యాయం చేస్తే పార్టీలకు గుణపాఠమే
- టికెట్ లేకుంటే మా ఓటు లేదు
- జనరల్, బీసీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
- 14 కుల సంఘాల జేపీసీ కీలక నిర్ణయం

**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**

రానున్న కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు మరోసారి అన్యాయం జరిగితే సహించేది లేదని ముదిరాజ్ కుల సంఘాలు స్పష్టం చేశాయి. టికెట్ల కేటాయింపులో జనాభా దామాషా ప్రకారం న్యాయం జరగకపోతే సంబంధిత రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించాయి. కరీంనగర్ జిల్లా రామచంద్రాపూర్ కాలనీలోని పెద్దమ్మ గుడి ఆవరణలో మంగళవారం 14 ముదిరాజ్ కుల సంక్షేమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కీలక చర్చా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ చిక్కు రాజయ్య, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బల్ల సత్తయ్య, జేఏసీ జనరల్ సెక్రెటరీ నిమ్మల కిషన్ పాల్గొని రానున్న అర్బన్ మున్సిపల్ ఎన్నికలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఇంతకుముందు జరిగిన ఎన్నికల్లో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ కులానికి తగిన ప్రాతినిధ్యం ఇవ్వలేదని, ఈసారి అన్ని జనరల్, బీసీ స్థానాల నుండి నామినేషన్ వేస్తామని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి ఎన్నికలో తమను పక్కన పెట్టడం అన్యాయమని, ఇకపై అలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పోనూ కార్పొరేషన్ లోని మిగతా సీట్ల పరిధిలో ముదిరాజ్‌లకు జనాభా దామాషా ప్రకారం కనీసం ఆరు నుంచి ఏడు సీట్లు కేటాయించాల్సిందేనని జేఏసీ డిమాండ్ చేసింది. ఏ రాజకీయ పార్టీ ఈ డిమాండ్‌ను విస్మరిస్తే, ఆ పార్టీని ఎన్నికల్లో ఓడించే విధంగా సమిష్టిగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ఇది బెదిరింపు కాదని, న్యాయమైన హక్కుల కోసం జరుగుతున్న పోరాటమని తెలిపారు.

ముదిరాజులు రాజకీయంగా ఎదిగిన వర్గమని, అవినీతి వ్యతిరేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన చరిత్ర ఉందని నేతలు గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికలతో పాటు భవిష్యత్తులో జరిగే శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తామని, టికెట్ లేకుంటే ఓటు లేదు అనే నినాదంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ముదిరాజ్‌లకు న్యాయం చేసే పార్టీలకు పూర్తి సహకారం ఉంటుందని, అన్యాయం చేసిన పార్టీలను రాజకీయంగా మర్చిపోమని హెచ్చరించారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది



**ఏక్ దం న్యూస్, కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఏక్ దం న్యూస్ సమగ్ర తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర కీలకమని, బాధ్యతాయుతమైన జర్నలిజం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్ రెడ్డి, సుద్దాల సర్పంచ్ కుంటెల్లి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ పాషా, మాజీ సర్పంచ్ కచ్చుకాయల బాలరాజు, మాజీ ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, వార్డు సభ్యులు బుర్ర రమేష్, బాధవేణి కనకసిద్ధిరాములు, వంశీ, బాబు, విజయ్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఉప్పుల గంగయ్య, నీరటి సంజీవ్, అవురం సురేష్, బోడ్డు రమేష్, సురేష్, అలాగే ఏక్ దం న్యూస్ రాజన్న సిరిసిల్ల ఇంచార్జ్ దొబ్బల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్



### ఇద్దరు వికలాంగులకు వీల్‌చైర్లు

### హామీ నెరవేర్చిన తంగళ్లపల్లి సర్పంచ్ రచన

**ఏక్ దం న్యూస్ , తంగళ్లపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గ్రామ సర్పంచ్ గడ్డం రచన మధుకర్ నెరవేర్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వికలాంగులు తమకు వీల్‌చైర్లు కావాలని కోరగా, గెలిచిన వెంటనే అందిస్తానని ఆయన మాటిచ్చారు. ఆ హామీని అమలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ తో పాటు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కేకే మహేందర్ రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. వారు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వికలాంగులకు వీల్‌చైర్లు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తమ బాధ్యతని, వీల్‌చైర్లు అందజేయడంలో సహకరించిన ఆది శ్రీనివాస్, కేకే మహేందర్ రెడ్డి లకు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కొండ శ్రీకాంత్, వార్డు సభ్యులు మాందాటి శారద, కొండ భరత్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంపల్లి శ్యామ్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఎర్ల శ్రీనివాస్, సంపాతి మల్లేష్, వనం బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్-బీజేపీలపై చల్ల హరిశంకర్ ఫైర




ఏక్ దం న్యూస్ , కరీంనగర్ :

కరీంనగర్ నగర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలది పూర్తిగా విఫలమని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. నగరంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు సమీపించగానే అభివృద్ధి పేరుతో కాంగ్రెస్, బీజేపీ నేతలు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. రెండేళ్లుగా నగరానికి ఒక్క రూపాయి నిధులు తీసుకురాని కాంగ్రెస్, ఇప్పుడు కొబ్బరికాయలు కొడుతూ అభివృద్ధి మాటలు చెబుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలోనే కరీంనగర్ సుందర నగరంగా రూపాంతరం చెందిందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు సరైన అభ్యర్థులు కూడా లేరని, అందుకే డివిజన్లలో కండువాలు పట్టుకొని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీలో గెలిచే అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నుంచి నాయకులను తీసుకొని టికెట్లు ఇస్తున్నారని విమర్శించారు. కండువా మార్చగానే మాజీ మేయర్ సునీల్ రావు మాటలు మారిపోయాయని, బీఆర్ఎస్ హయంలో జరిగిన అభివృద్ధినే ఇప్పుడు బీజేపీ అభివృద్ధిగా చెబుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదంటున్న సుడా చైర్మన్, తన ఇంటి ముందు రోడ్ ఎవరు వేశారో గుర్తించాలన్నారు. డంప్ యార్డు సమస్య పరిష్కారానికి వంద కోట్లు తీసుకువచ్చిన తర్వాతే బీజేపీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని హితవు పలికారు. నగర అభివృద్ధికి మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన కృషి ప్రజలకు తెలుసన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి ఏమి చేశారో చెప్పిన తర్వాతే ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేతలు రాజేందర్ రావు, నరేందర్ రెడ్డి, బీజేపీ నేతలు బీఆర్ఎస్‌పై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. కరీంనగర్ ప్రజలు చైతన్యవంతులని, అభివృద్ధికి నిజంగా కృషి చేసిన బీఆర్ఎస్ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గెలిస్తేనే నగరం అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో మాజీ కార్పొరేటర్ దిండిగాల మహేష్, కచ్చు రవి, బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, బీఆర్ఎస్వి అధ్యక్షుడు బొంకూరి మోహన్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.












- మొదటి రోజే 255 దరఖాస్తులు
- సర్వే ఆధారంగా తుది జాబితా
- కార్యకర్తలకు న్యాయం చేస్తామని హామీ

# కరీంనగర్ కాంగ్రెస్‌లో టికెట్ల హీట్

**ఏక్ దం న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ నగర కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న కార్పొరేటర్ ఆశావాహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఊపందుకుంది. మంగళవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పంచాయతీరాజ్ సంఘటన చైర్మన్ మడుపు మోహన్ తో పాటు పలువురు సీనియర్ నేతల సమక్షంలో దరఖాస్తులు స్వీకరించారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి తొలి రోజే 255 దరఖాస్తులు అందడం కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న ఉత్సాహానికి అద్దం పడుతోంది. కార్పొరేషన్ ఎన్నికలను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఆశావాహులు పెద్ద సంఖ్యలో డీసీసీ కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ శ్రేణుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్రమబద్ధీకరించి తుది జాబితాను పీసీసీకి అందజేయడం జరుగుతుందని తెలిపారు. సర్వే నివేదికలు, గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకుని గెలిచే అభ్యర్థులకే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 22న మధ్యాహ్నం 1 గంటల వరకు గడువు ఉంటుందని వెల్లడించారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను విస్మరించబోమని, వారికి తప్పకుండా సముచిత స్థానం కల్పిస్తామని అంజన్ కుమార్ హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా పార్టీ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.